

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 39 | శనివారం 16, మే 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## దేశం గర్వించేలా

# పుట్టపర్తి అభివృద్ధి





- రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్
- ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది
- జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి
- అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- దేశ అభివృద్ధిలో ఇక ఏపి కీలక భూమి అన్న చంద్రబాబు

పుట్టపర్తి, మే 15 : దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారు కాబోతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్య సాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్

2 లో

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల



- లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు
- ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

న్యూఢిల్లీ, మే 15: ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్ల ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: దిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68 , చెన్నైలో 103.67 (?2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: దిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన

2 లో

# ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

పుట్టపర్తి, మే 15 : శ్రీ సత్యసాయి జిల్లాలో మంత్రి నారా లోకేశ్ రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని మంత్రి సందర్శించారు. ప్రశాంతి నిలయంలో లోకేశ్‌కు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం సాయి కుల్వంత్ మందిరంలోని శ్రీ భగవాన్ సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ స్టేట్ మీడియా కోఆర్డినేట్ రాష్ట్ర కార్యదర్శి బి.వి రాముడు తదితరులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్

2 లో



## వచ్చే ఏడాది

# నీట్ ఆన్‌లైన్ పరీక్ష

- లీకేజీని అరికట్టేందుకు చర్యలు
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్




న్యూఢిల్లీ, మే 15 : నీట్ పేపర్ లీక్ వ్యవహారం సంచలనం సృష్టించింది. దాంతో మే 3న నిర్వహించిన పరీక్షను రద్దు చేసి, మళ్లీ జూన్ 21న ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శుక్రవారం వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని వెల్లడించారు. జూన్ 21న నీట్ రీఎగ్జామ్ తేదీ ఖరారైంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై విచారణకు ఆదేశించాం. ఇప్పటికే ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసు కుంటాం. విద్యార్థులకు ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. వారు నష్టపోకూడదనే పరీక్ష రద్దు చేసి

2 లో

## కర్ణాటకలో ఘోర

# రోడ్డు ప్రమాదం

- బ్రిడ్జిపై నుంచి అదుపుతప్పి కిందపడ్డ ట్రాక్టర్
- ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం



బెంగళూరు, మే 15: కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మునీరాబాద్ సమీపంలో బ్రిడ్జిపై వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి కిందపడటంతో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడగా, వారిలో 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై

2 లో

## గుంటూరు జిల్లాలో

# ఫుడ్ పాయిజన్ కలకలం

- 50 మందికి అస్వస్థత



గుంటూరు జిల్లా, మే 15 : గుంటూరు జిల్లాలో ఫుడ్ పాయిజన్ ఘటన కలకలం రేపింది. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో జరిగిన ఈ ఘటనలో దాదాపు 50 మంది గ్రామస్థులు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఉన్న బేతస్థ ప్రార్థనా మందిరంలో ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భోజన వసతులు కల్పించారు. అయితే నిన్న (గురువారం)

2 లో

# ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

## – ప్రధాని మోడీకి పవన్ కళ్యాణ్ కృతజ్ఞతలు



అమరావతి, మే 15 : శ్రీసత్య సాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్ట ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే

4 లో

# సంపాదకీయం

## ట్రంప్ కుంపటితో ఆర్థిక రంగం కుదేలు !

ఇరాన్‌పై దాడితో ప్రపంచ దేశాలను ప్రమాదంలో పడేసిన ట్రంప్ ఇంకా మేల్కొనలేదు. తనవల్ల ప్రపంచం అతలాకుతలం అయ్యిందే అన్న కించిత్ చింతన కూడా కానరావడం లేదు. పైపెచ్చు..ఇరాన్‌ను భూమండలం మీద లేకుండా చేస్తామని కూడా ప్రకటించారు. ఇరాన్ సంగతి ఎలా ఉన్నా...భారత్ లాంటి దేశాలు చమరు ధరలతో విలవిల్లాడుతున్నాయి. ఆర్థిక సంక్షోభం తప్పేట్లుగా లేదు. చమురు రవాణా ఆగిపోవడంతో పాటు, ముడి చమురు ధరలు పెరగడంతో నానాయాతన పడాల్సి వస్తోంది. తాజాగా భారత్‌లో పెట్రీ, డీజిల్ దలరు పెరిగాయి. ఈ పెరుగుదల ఒక్క ఇంధనంపైనే ఉండదు. ఇకనుంచి అన్నిరంగాల పై దీని ప్రభావం పడుతుంది. నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతాయి. విమానయాన రంగం ఇప్పటికే గగనకుసుమమైంది. ఇది మరింత ప్రమాదంలో పడనుంది. వెరసి సామాన్యుల బతుకులు భారం కానున్నాయి. పొదుపు మంత్రం ప్రకటించిన ప్రధాని మోడీ కాన్వాయ్‌లను తగ్గించారే తప్ప, అసలు పొందుపు విషయంలో మాట్లాడడం లేదు. దేశంలో ప్రజాప్రతినిధుల దుబారాను తగ్గించే ప్రయత్నాలపై ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. దీనికితో తోడు ఈ సంక్షోభం దృష్ట్యా ఐటి కంపెనీల్లో ఉద్యోగాల కోతలు మొదలయ్యాయి. రిక్రూట్‌మెంట్లు తగ్గాయి. ప్రధాని మోడీ ఇచ్చిన వర్క్‌ఫ్రమ్ హోమ్ విధానం అమలు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. కరోనా సమయంలో విధిలేక ఆఫీసులు మూసుకున్న ఐటి కంపెనీలు ఇప్పుడు ఉద్యోగులను వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిమితం చేయదల్చుకోలేదు. దేశంలో పెరుగుతున్న ఇంధన వినియోగాన్ని తగ్గించి, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఒక కీలక ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారు. ఉద్యోగులు వీలైనంత వరకు ఇంటి నుండే పని చేసే విధానాన్ని పాటించాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో, దేశీయ ఐటీ హబ్‌లలో ఒకటైన హైదరాబాద్‌పై ఈ నిర్ణయం ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో మెజారిటీ ఉద్యోగులు తమ కార్యాలయాలకు చేరుకోవడానికి ప్రతిరోజూ సగటున 50 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తున్నారు. ఈ సుదీర్ఘ ప్రయాణం వల్ల అటు ట్రాఫిక్ సమస్యలు పెరగడమే కాకుండా, భారీగా ఇంధనం ఖర్చవుతోంది. ప్రధాని సూచన మేరకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని అమలు చేస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హైదరాబాద్ ఐటీ రంగంలో ఈ విధానం వల్ల కలిగే ఆర్థిక ప్రయోజనాలపై ప్రాథమిక అంచనాలు వెలువడ్డాయి. నగరంలోని మొత్తం ఐటీ ఉద్యోగులలో కనీసం సగం మంది, అంటే సుమారు 4.5 లక్షల మంది వారానికి కేవలం మూడు రోజులు ఇంటి నుండి పని చేసినా అద్భుతమైన ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల నెలకు దాదాపు 140 కోట్ల రూపాయల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా. ఇది దేశీయ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఊరటనిస్తుందని భావిస్తున్నారు. ఇలా ఒక్కో నగరాన్ని తీసుకుంటే గణనీయమైన మార్పులు ఉంటాయని అంటున్నారు. కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం విజయవంతంగా అమలు జరిగినప్పటికీ, ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీలు ఈ విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. పెద్ద కంపెనీలు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూస్తుండగా, కొన్ని చిన్న స్థాయి సంస్థలు మాత్రం ఈ విధానం వల్ల తమ ఉత్పాదకత దెబ్బతింటుందని లేదా ఇతర నష్టాలు వస్తాయని ఆందోళన చెందుతున్నాయి. ప్రభుత్వం నుండి స్పష్టమైన మార్గదర్శకాలు వస్తే తప్ప ఈ విషయంలో క్లారిటీ వచ్చేలా లేదు. కేవలం వర్క్ ఫ్రమ్ హోమ్ మాత్రమే కాకుండా, పెట్రోల్ , డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం కూడా అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి నుండే పని చేయడం వల్ల ఇంధన దిగుమతులు తగ్గి, అంతర్జాతీయ మార్కెట్‌లో భారత రూపాయి విలువ పెరగడానికి తోడ్పడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ ఆర్థిక భవిష్యత్తుకు ఈ 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానం ఒక కీలక మలుపు కానుంది. ఇకపోతే ఆర్థిక సంక్షోభం కారణంగా అనేక ఐటి కంపెనీలు కుదింపు మోజులో పడ్డాయి. ఎడాపెడా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. గత నెలలో ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించిన అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ ఒరాకిల్.. తాజాగా మరో షాకిచ్చింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) వంటి పలు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ పక్రియ ద్వారా విద్యార్థులకు జారీ చేసిన జాబ్ ఆఫర్ లెటర్లను, ప్రీ–ప్లేసమెంట్ ఆఫర్ల (పీపీఓ)ను కంపెనీ రద్దు చేసింది. ఒరాకిల్ తాజా నిర్ణయంతో ప్రభావితమైన కాలేజీల్లో ఎన్‌ఐటీ వరంగల్, వీఎన్‌ఐటీ నాగ్‌పూర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ, ఐఐటీ బీహెచ్‌యూ కూడా ఉన్నాయి. ఆఫర్ లెటర్ల రద్దు విషయాన్ని కంపెనీ ఈ వారంలోనే విద్యార్థులకు వెల్లడించింది. దాంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఎందుకంటే, చాలావరకు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రాంగణ నియామకాల విషయంలో ఒక విద్యార్థి– ఒక ఉద్యోగం విధానాన్ని అనుసరిస్తున్నాయి. అంటే, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పక్రియలో ఒక కంపెనీ నుంచి జాబ్ ఆఫర్ అందుకున్న విద్యార్థికి ఇతర కంపెనీల ఆఫర్లను దక్కించుకునే అవకాశం ఉండదు.

# కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ఓ కార్యక్రమం ముగించుకుని తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బ్రిడ్జిపై మలుపు వద్ద డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో ట్రాక్టర్ కిందకు పడిపోయిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే లారీ ఢీకొట్టడంతో వంతెన పైనుంచి ట్రాక్టర్ కిందపడిందని కూడా అంటున్నారుజ ఈ ప్రమాదంలో ఏడాది చిన్నారి సహా ఆరుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 10 మందికి గాయాలయ్యాయి. కొప్పల తాలూకా మునీరాబాద్ వద్ద వంతెనపై ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగే సమయానికి ట్రాక్టర్‌లో 16 మంది ఉన్నారు. మునీరాబాద్ సమీపంలోని హులిగమ్మ దర్శనానికి ట్రాక్టర్‌లో భక్తులు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. మృతులను సండూరు, కూడ్లిగి ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలాన్ని కొప్పల, విజయనగర ఎస్పీలు పరిశీలించారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదానికి గల అసలు కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ది

మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు.రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస్ రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ఎ÷–లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.

# వచ్చే ఏడాది నీట్ ఆన్‌లైన్ పరీక్ష

మళ్లీ నిర్వహిస్తున్నాం అని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండేలా చూడటమే మా మొదటి లక్ష్యం. పరీక్ష పారదర్శకంగా నిర్వహించడమే మా ప్రధాన కర్తవ్యం. ఏటా కోటి మందికి ఎన్టీఏ పరీక్షలు నిర్వహిస్తోంది. పేపర్ ఎలా లీక్ అయింది.. ఎవరి నుంచి ఎక్కడికి వెళ్లిందన్న పూర్తి వివరాలు పూర్తి బహిర్గతమవుతాయి. ఈసారి ఎలాంటి పరిస్థితుల్లోనూ మాల్ ప్రాక్టీస్ జరగకుండా చూసుకుంటాం. రీటెస్ట్ కోసం విద్యార్థులు నచ్చిన నగరాన్ని ఎంచుకోవడానికి వారం రోజులు గడువు ఇస్తున్నాం. జూన్ 14న అడ్మిట్ కార్డులు విడుదల చేస్తాం. నీట్ కోసం మళ్లీ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోన్న వార్తలు చూసి విద్యార్థులు

ఆందోళన చెందొద్దని ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

## ప్రశాంతి నిలయం దర్శించుకున్న లోకేశ్

మీడియం కాంబాట్ ఎయిర్ క్రాఫ్ట్(ఏఎంసీఏ) తయారీ కేంద్రానికి శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొననున్నారు. ఏఎంసీఏ ఇంటిగ్రేషన్, ఫ్లైట్ టెస్టింగ్ సెంటర్, ఏరోనాటికల్ డెవలప్ మెంట్ ఏజెన్సీ, ఇతర రక్షణ రంగ ప్రాజెక్టులకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు నాయుడుతో కలిసి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15,803 కోట్లతో ఏఎంసీఏ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. దీంతో 7,500 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నారు.

# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

## ప్రభుత్వ బడి పిల్లల పండుగ ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో అపూర్వ సత్కారం

## లోకేష్ కృషితోనే విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు:ఎమ్మెల్యే రాము

గుడివాడ, మే 14ి:పదో తరగతి ఫలితాల్లో 550 మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'సగర్వంగా నిల'బడి'న గుడివాడ కుసుమాలకు అభినందనలు' పేరుతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కుటుంబం ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించింది. సత్యనారాయణపురంలోని ఐఎంఏ హాల్లో జరిగిన ఈ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది.ఎమ్మెల్యే రాము, భార్య సుఖదా, కుమార్తె ప్రత్యూష, ఏపీఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఆత్మీయంగా ముచ్చటించారు. జిల్లా ర్యాంకులు సాధించిన విద్యార్థులను సభకు పరిచయం చేసి ఎమ్మెల్యే కుటుంబం ప్రత్యేకంగా అభినందించింది. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ "ఇంతమంది పిల్లలు అద్భుత ఉత్తీర్ణత సాధించడం చూస్తుంటే నాకు ఎంతో గర్వంగా ఉందన్నారు. మీ బంగారు భవిష్యత్తు కళ్లముందు కనిపిస్తోందనీ,ప్రతి సంవత్సరం ఇలాంటి ఫలితాలతో ముందుకు సాగితే గుడివాడ భవిష్యత్తు తప్పకుండా మారుతుందన్నారు.ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఇంత మార్పు రావడానికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిని నేను స్వయంగా చూస్తున్నాననీ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో అనేక పెద్ద శాఖలు ఉండగా విద్యాశాఖ తీసుకోవడం చూసి ఆశ్చర్యపోయానని ,కానీ పిల్లల భవిష్యత్తు మార్చడానికే లోకేష్ ఆ శాఖ తీసుకున్నారని ఇప్పుడు అర్థమైందన్నారు. మెగా పేరెంట్స్–టీచర్స్ మీట్, ఇతర సంస్కరణలు అద్భుత ఫలితాలిస్తున్నాయనీ ఎమ్మెల్యే రాము అన్నారు.ప్రభుత్వ బడుల్లో 'ఇది లేదు' అని చెప్పడానికి లేకుండా అన్ని సౌకర్యాలు వచ్చాయనీ, ప్రైవేటులో డబ్బులు పెట్టి కొనేది ఇక్కడ ఉచితంగా ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. లోకేష్ స్ఫూర్తితో, మీ స్ఫూర్తితో గుడివాడలో ప్రభుత్వ బడుల్లో చేరికలు పెంచేందుకు సీరియస్‌గా పనిచేస్తానీ,వచ్చే ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత పెంచడం,చేరికలు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.విద్యార్థులు సాధించిన ఫలితాలు చూసి నాకు మళ్లీ పదో తరగతి పరీక్ష రాయాలనిపించింది" అని నవ్వుతూ చెప్పడంతో సభ చప్పట్లతో మార్మోగింది. "మీరే అంబాసిడర్లుగా మారి గ్రామాల్లో ప్రభుత్వ బడుల గొప్పతనం చెప్పండి" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు.వెనిగండ్ల ఫౌండేషన్ కన్వీనర్ సుఖదా మాట్లాడుతూ "రాష్ట్రవ్యాప్తంగా, గుడివాడలో ప్రభుత్వ బడి పిల్లల ఫలితాలు చూసి సంతోషించాననీ చెప్పారు. గుడివాడ అమ్మాయి జిల్లా ఫస్ట్ రావడం నా కూతురే సాధించినంత ఆనందంగా ఉందన్నారు. నేను కూడా టౌన్ ఫస్ట్ వచ్చాననీ, కష్టపడితే ఫలితం తప్పకుండా వస్తుందన్నారు. ఎమ్మెల్యే రాము ఎవరి ప్రోత్సాహం లేకున్నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చారు" అని అన్నారు.కుమార్తె ప్రత్యూష మాట్లాడుతూలి విద్యార్థులు అందరూ, "ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. జీవితం ఎప్పుడూ కొనసాగుతునే ఉంటుందని, ఎక్కడ ఆగకుండా ఉత్తేజంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చు అన్నారు. మనం భవిష్యత్తులో ఎదగడానికి ఇంకా చాలా అవకాశాలు ఉంటాయనీ అంకితభావంతో కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుందన్నారు.

# గుంటూరు జిల్లాలో ఫుడ్ పాయిజన్ కలకలం

రాత్రి మిగిలిపోయిన ఆహారాన్ని ఈరోజు (శుక్రవారం) కొందరు తిన్నట్లు సమాచారం. ఆహారం పాడై ఉండటంతో తిన్న కాసేపటికే పలువురు అస్వస్థతకు గురయ్యారు.విషమంగా ఆరుగురి ఆరోగ్యం.. ఆహారం తిన్న కొద్ది గంటల్లోనే పలువురికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపించాయి. ఒక్కసారిగా గ్రామంలో పలువురు అస్వస్థతకు గురికావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పరిస్థితి విషమంగా మారడంతో బాధితులను వెంటనే సమీప ఆస్పత్రులకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఆరుగురిని మెరుగైన చికిత్స కోసం తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

**కొత్తరెడ్డిపాలెంలో భయాందోళనలు**

ఈ ఘటనతో కొత్తరెడ్డిపాలెం గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని సరైన విధంగా నిల్వ చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఆహారం త్వరగా పాడయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.నిల్వ ఉంచిన ఆహారాన్ని తిరిగి వినియోగించే ముందు నాణ్యతను పరిశీలించాలని హెచ్చరి స్తున్నారు. గుంటూరు జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన ప్రస్తుతం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

# ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ / ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

# ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎంపీడీవో జయశ్రీ పుల్లంపేట



ప్రజాసీమ న్యూస్ : తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+ూ) కింద పీవీజీ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొండంపల్లి .బలిజపల్లి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఫీడర్ ఛానల్ పనులను మండల అభివృద్ధి అధికారి కుమారి జయశ్రీ స్వయంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న కార్మికుల హాజరు నమోదు విధానాన్ని వివరంగా పరిశీలించారు. ఎంపీడీవో ఉపాధి వేసికర్స్ మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా కార్మికులు ఉదయం త్వరగా పనులకు హాజరు కావాలని సూచించారు.ప్రతి పని దినానికి పని ప్రారంభంలో ఒక ఫోటో మరియు పని ముగిసిన తర్వాత మరొక ఫోటో తప్పనిసరిగా తీసి చీవీమీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు కఠిన హెచ్చరికలు జారీ చేస్తూ, నిజంగా పనికి హాజరైన కార్మికులకు మాత్రమే హాజరు నమోదు చేయాలని, ఏవైనా అవకతవకలు జరిగితే తీవ్ర చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు."పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడం ద్వారా మాత్రమే గ్రామీణ పేదలకు న్యాయం జరుగుతుంది" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఫీల్డ్ అసిస్టెంట్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ సర్వే తనిఖీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో: శ్రీనివాసులు పుల్లంపేట




ప్రజా సీమ న్యూస్ : తిరుపతి జిల్లా పుల్లంపేట మండల పరిధిలో జాతీయ సెన్సస్ సర్వే పనులను డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని దాసరిపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహిస్తున్న సర్వే పనులను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్న సర్వే ఇనుమరేటర్ల పనితీరును సమీక్షించిన ఆయన, సర్వే ఫారాల్లో డీహెడింగ్‌కు సంబంధించిన పేరు, కుటుంబ సంబంధం, వయసు తదితర వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.తనిఖీ సందర్భంగా గుర్తించిన కొన్ని డీహెడింగ్ లోపాలను వెంటనే సరిచేయించి, సర్వే పనులను వేగవంతంగా మరియు తప్పులులేకుండా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

# పారిశ్రామిక దిగ్గజం డాక్టర్ జి.ఎన్. నాయుడుకు ఘన నివాళి

## - టి.కమ్మపల్లిలో చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి సంతాపం తెలిపిన ప్రముఖులు పుల్లంపేట





ప్రజాసీమ న్యూస్ : పుల్లంపేట మండల పరిధిలోని టి.కమ్మపల్లి గ్రామంలో ప్రముఖ పారిశ్రామికవేత్త, యానాం రీజెన్సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, డాక్టర్ జి.ఎన్. నాయుడు మరణంపై పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించి సంతాపం తెలిపారు.ఈ సందర్భంగా ముక్కా రూపానంద రెడ్డి జి.ఎన్. నాయుడు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయుడు పరిశ్రమ రంగానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. శుక్రవారం ఆయన జన్మస్థలమైన టి.కమ్మపల్లిలో, ఆయన కోరిక మేరకు స్వంత పొలంలో ఏర్పాటు చేసిన సమాధి వద్ద బ్రాహ్మణులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన స్వగృహంలో జి ఎన్ నాయుడు భార్య సరోజినీ నాయుడు, కుమార్తెలు అల్లుళ్ళు,రాధిక నాయుడు, సత్యంద్ర ప్రసాద్,బిందు నాయుడు,సుభాష్, మనవళ్ళు మనవరాళ్లురిషిక,కిరీటి,అనామిక, రియాన్ తమ్ముళ్లు జి.ఎన్.నాయుడుడా'' సుబ్బరాయుడునాయుడు పాల్గొనిసంతాపసభ నిర్వహించారు.కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ, జి.ఎన్. నాయుడు టి.కమ్మపల్లి గ్రామాన్ని దేశ విదేశాలకు పరిచయం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి, విద్యా రంగానికి ఆయనచేసినసేవలుమరువలేనివని తెలిపారు.టి.కమ్మపల్లి గ్రామంలో హైస్కూల్ ఏర్పాటు, పాఠశాల భవన నిర్మాణం, పలు గ్రామాలు, దేవాలయాలు, విద్యాసంస్థలకు పాలిష్ బండల విరాళాలు అందించడం ద్వారా ఆయన చేసిన సేవలను గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. పుల్లంపేట మండలంలోని ఒక గ్రామానికి ఆయన పేరు మీద జి.ఎన్. నగర్గా నామకరణం చేయడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు. విశ్వనాథ నాయుడు విశ్వేశ్వర్ నాయుడు మాజీ మండల అధ్యక్షుడు ఆరే సుధాకర్ నాయుడురాఘవ.కృష్ణమ నాయుడు ఆదినారాయణ రెడ్డి నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్గీయ డాక్టర్ జి.ఎన్. నాయుడుకు నివాళులర్పించారు.

# అకటా! పాపాగ్నీ నది గర్భంలో డంపింగ్ యార్డ్

## - దరిద్ర కేంద్రంగా సంపద కేంద్రం, స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కేవలం మాటల్లోనే,డా.తులసిరెడ్డి



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:ప్రధాని పదేపదే స్వచ్ఛ భారత్, సిఎం చంద్రబాబు పదేపదే స్వచ్ఛాంధ్ర అంటుంటారే తప్ప ఆచరణలో మాత్రం మురికి భారత్, మురికి ఆంధ్ర, మురికి వేంపల్లెగా తయారైందని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు స్థానిక పాపాగ్నీ నది గర్భంలో వేసిన డంపింగ్ యార్డ్ గుట్టలను పరిశీలించారు. అనంతరం తులసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోనే వేంపల్లె గ్రామ పంచాయతీ అతిపెద్ద మేజర్ పంచాయతీ అని, దాదాపు 50 వేల మంది జనాభా ఉంటారన్నారు. గత మూడు నెలలుగా పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వని కారణంగా బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. దీంతో పంచాయతీ మురికి కూపంగా తయారైందన్నారు. డ్రైనేజీ కాలువలు ప్లాస్టిక్ వస్తువులతో, చెత్తాచెదారంతో నిండిపోయాయి.. కొన్ని చోట్ల మురికి కుంటలుగా తయారైందన్నారు. రోడ్ల మీద ఎక్కడ చూసినా మురికి దిబ్బలు దర్శనమిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయని, సంపద కేంద్రం దరిద్ర కేంద్రంగా దర్శనమిస్తోంద న్నారు. గత కాంగ్రెస్ పాలనలోనే డంపింగ్ యార్డ్ కోసం పాములూరు గుట్టమీద స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. పారిశుధ్య సిబ్బంది చెత్త చెదారాన్ని పాపాగ్నీ నదిలో వదిలేస్తున్నారని అన్నారు. దీంతో నది కలుషితమై పరివాహక ప్రజలు అంటువ్యాధులతో అనారోగ్యానికి గురై అవకాశం ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం పారిశుధ్య సిబ్బందికి పెండింగ్ బకాయిలు చెల్లించాలని, డంపింగ్ యార్డ్ పాములూరు గుట్టమీద కేటాయించిన స్థలాన్ని ఉపయోగించు కోవాలని, సంపద కేంద్రాన్ని అమల్లోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ధృవకుమార్ రెడ్డి, డా.సుబ్రమణ్యం, రామకృష్ణ, రామాంజనేయరెడ్డి, వెంకటేష్, ఉత్తన్న, రవీంద్రారెడ్డి, బద్రీ, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# దళితుల పక్షపాతి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

## - కూటమి పాలనలో దళితులపై పెరిగిన దాడులు - వైఎస్సార్సీపీ ఎస్సీ సెల్ నాయకుల ఆరోపణలు - మదనపల్లిలో వైకాపా ఎస్సీ సెల్ ఆత్మీయ సమావేశం





మదనపల్లె (ప్రజా సీమ) : మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దళితుల పక్షపాతి అని,కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం దళితుల ఒరిగింది శూన్యమని వారిపై దాడులు,దౌర్జన్యాలు పెరిగిపోయాయని వైఎస్ఆర్సిపి ఎస్సీ సెల్ నాయకులు పేర్కొన్నారు.శుక్రవారం బైపాస్ రోడ్డు,చంద్ర కాలనీ వద్ద గల జీనత్ ఫంక్షన్ హాల్ నందు వైకాపా ఎస్సీ సెల్ జిల్లాస్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది.ఈ సమావేశానికి వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు చుక్కా అంజనప్ప,జిల్లా పరిశీలకులు చామలూరి రాజగోపాల్,రాష్ట్ర కార్యదర్శులు దండు గోపి,కె.వి.రమణ,మదనపల్లె మునిసిపల్ ఏరియా సెక్రెటరీ నాగమణి,మండల మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవి,జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ,మహేష్,అనిల్,చెన్న కుమార్,రాజ్ కుమార్,శ్రీహరి,లక్ష్మీనారాయణ,బొజ్జా పెంచలయ్య,జిల్లా అధికార ప్రతినిధులు హేమంత్ కుమార్,పుంగనూరు రెడ్డెప్ప మరియు రామాంజులు,రెడ్డెయ్య,శ్రీనివాసులు,పెంచలయ్య పెద్దఎత్తున ఎస్సీ విభాగం నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా చామలూరి రాజగోపాల్,చుక్కా అంజనప్ప మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి వైఎస్ఆర్సిపి,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎనలేని కృషి చేశారన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో దళితులపై దాడులు,దౌర్జన్యాలు మితిమీరిపోయాయన్నారు. మంత్రి నారా లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం దళితులను అణిచివేయడానికి రూపొందించాలని విమర్శించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయలేదని,దళితులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దళితులను విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చంద్రబాబుని వారు హెచ్చరించారు.వైకాపా పాలనలో దళితులకు ఎంతో మేలు జరిగిందన్నారు.ఎస్సీ సెల్ విభాగాన్ని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు 2029 శాసనసభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని వారు స్పష్టం చేశారు.వైయస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు ప్రతి ఎస్సీ ఒక సైనికుడిలా పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.అంతేకాకుండా జిల్లా స్థాయిలో ఎస్సీ విభాగాన్ని మరియు పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.అదేవిధంగా ఎస్సీ సెల్ జిల్లాస్థాయి ఆత్మీయ సమావేశానికి తరలివచ్చి జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

# ఎన్నికలు ముగియగానే బీజేపీ అసలు రంగు బయట పెట్టింది

## - పెట్రోల్,డీజిల్ ధరలు పెంపు దారుణం -కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ విమర్శలు



మదనపల్లె (ప్రజా సీమ) : 5 రాష్ట్రాల ఎన్నికలు పూర్తవ్వగానే బీజేపీ అసలు రంగు బయట పెట్టిందని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ పేర్కొన్నారు.శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడుతూ నేటి నుండి పెట్రోల్ లీటర్ రూ.3.14,డీజిల్ లీటర్ రూ.3.11 రూపాయల పెంచడంపై బిజెపి ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు.అలాగే దరల పెంపును తీవ్రంగా ఖండించారు.కేంద్ర ప్రభుత్వ విధానాలు,తప్పిదాలు సామాన్య,మధ్యతరగతి ప్రజలపై భారం మోపే విధంగా ఉన్నాయని విమర్శలు గుప్పించారు.ప్రధాని తెలంగాణ పర్యటనలో 10 పొదుపు సూత్రాలు సూచించడాన్ని తనకు తప్ప మిగిలిన వారికేనా అంటూ ఎద్దేవా చేశారు.దేశ చరిత్రలో ఇంతవరకు ఏ ప్రధాని ఇలాంటి సూచనలు చేయలేదన్నారు.పెట్రోల్,డీజిల్ వాడకాన్ని తగ్గించాలని సూచించిన వెంటనే రూ.3 రూపాయలు మేర పెంచడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు.పెట్రోల్,డీజిల్ వాహనాలకు బదులుగా విద్యుత్ వాహనాలు,విద్యుత్ వినియోగంపైన సూచనలు చేయడం కేవలం ఆదానికి దోచిపెట్టడానికేనని ఆరోపించారు.వంటనూనెలు పరిమితంగా వాడాలని చెప్పడం వారి చేతగాని పతనానికి నిదర్శనమన్నారు.ప్రజలు ఏమీ తిని బ్రతకాలని నిలదీశారు.అంతేకాకుండా ఏడాదిపాటు బంగారు కొనుగోలు చేయవద్దని చెప్పడం,విడ్డూరంగా ఉందని,ఆ రంగాలలో పనిచేసే వ్యాపారస్తులు కార్మికులు ఎలా జీవించాలని పేద,మధ్య తరగతి ప్రజలు ఇండ్లలో పెళ్ళిళ్లు,ఇతర శుభకార్యాలు ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు.వారి ఇండ్లలో శుభకార్యాలు జరగడం కూడా ఇష్టం లేని విధంగా దిగుమతి సుంకం పెంచి బంగారు,వెండి ధర పెరుగుదల కారణమయ్యారని విమర్శించారు.రసాయన ఎరువులు వాడకం వద్దు,సేంద్రీయ ఎరువులు వాడాలని చెప్పే మీరు ఆదిశగా చేసిన చర్యలు ఏమిటని ప్రశ్నించారు.సామన్య ప్రజలపై పెట్రోలు,డీజిల్ భారం అధికంగా వేస్తే,నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వలన ప్రజలకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు.కేంద్ర ప్రభుత్వం కేవలం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టాడానికే తప్ప సామాన్య ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో సరైన సమాధానం చెబుతారని ఆయన హెచ్చరించారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# జంగాల శివరాం తన నిజాయితీని నిరూపించుకోవాలి

## - బీఎస్పీ ఆరోపణలపై వివరణ ఇవ్వాలి
## - గోటితో పోయే అంశాన్ని గొడ్డలి దాకా తెచ్చుకోవద్దు
## - జనసేన నాయకులు రాయల్ గణి హితవు




మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం రాయల్ తన నిజాయితీని నిరూపించుకోవాలని,బీఎస్పీ నాయకుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని జనసేన నాయకులు రాయల్ గణి పేర్కొన్నారు.శుక్రవారం ది మదనపల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిరులవంకను జంగాల శివరాం ఆక్రమించారంటూ బీఎస్పీ నాయకులు రెవెన్యూ అధికారుల దగ్గర ఆధారాలతో సహా నిరూపించిన ట్లు తెలుపుతున్నారని,దీనిపై జంగాల శివరాం స్పందించి తనపైవస్తున్న కబ్జా ఆరోపణలకు వివరణ ఇవ్వాలన్నారు.వ్యక్తిగత విషయాలను పార్టీ రంగు పులవడం జనసేన పార్టీకి,అధినేత పవన్ కళ్యాణ్ కి చెడ్డపేరు వచ్చే అవకాశంఉందన్నారు. నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయాలే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించా రని స్పష్టం చేశారు.ప్రస్తుతం జంగాల శివరాం గౌరవప్రదమైన హోదాలో ఉండి ఇలాంటి విమర్శ లను ఎదుర్కోవడం అతని రాజకీయ ఎదుగుదలకు మంచిది కాదన్నారు. సిరులు వంక ఆక్రమణ విషయమై బీఎస్పీ నాయకులు పట్టు వదలడం లేదని,ఆధారాలు సంపాదించారని సదరు సమస్యను జనసేన పార్టీ మదనపల్లి ఇంచార్జ్ గంగారపు రాందాస్ చౌదరి దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని హితవు పలికారు.2014 ఎన్నికల్లో రాందాస్ చౌదరి గెలుపు కోసం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ఎంతో శ్రమించారని,ఈ విషయం అందరికీ తెలుసునని గుర్తుచేశారు.రాజకీయ పార్టీల నాయకుల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఎంతో ముఖ్యమని,దీనిని దృష్టిలో ఉంచుకొని నాయకులు నడుచుకోవాల న్నారు.వందల,వేల ఎకరాలు కబ్జాలు చేసిన వారు చాకచక్యంగా తమ పనులను చక్కబెట్టుకుంటున్నా రని,ఈ చిన్న విషయాన్ని జంగాల శివరాం రాయల్ పెంచుకుంటున్నారని వెల్లడించారు.ఇది పెంచుకుం టూ పోతే వేరే పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందని,కూటమి పెద్దలను సంప్రదించి ఈ సమస్యకు చెక్ పెట్టాలని జనసేన పార్టీ నాయకుడిగా జంగాల శివరాంకు ఓ శ్రేయోభిలాషిగా చెబుతున్నామన్నారు. కావున వ్యక్తిగత సమస్యలతో జనసేన పార్టీకి,అధినేత ప్రతిష్ట దెబ్బతీయొద్దని సూచించారు

# అన్నమయ్య జిల్లా బిజెపి అధ్యక్షులుగా నరేంద్ర కుమార్ రెడ్డి

## - ఉత్తర్వులు జారీ చేసిన పార్టీ అధిష్ఠానం



మదనపల్లె (ప్రజా సీమ) : భారతీయ జనతా పార్టీ అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షులుగా పులి నరేంద్ర కుమార్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నందు విద్యార్థి నాయకుడిగా 1993లో బీజేవైఎం ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగాను 1996లో వాయల్పాడు అసెంబ్లీ ఇన్చార్జిగా 1999 ఎన్నికల్లో తంబళ్లపల్లి ఎన్నికల కోఆర్డినేటరుగా,2000 సంవత్సరంలో మదనపల్లి మున్సిపల్ ఎన్నికల క్యాంపైనరుగా,2006 సంవత్సరంలో పీలేరు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనరుగా 2012 వరకు,పీలేరు నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనరుగా 2012 నుంచి 2015 వరకు చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ 2016 నుంచి 2020 మధ్య బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా 2020 నుంచి 2022 మధ్య రాజంపేట పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా 2022 నుంచి 2025 మధ్యకాలంలో అన్నమయ్యజిల్లా ఉపాధ్యక్షుడిగా 2025 సంవత్సరంలో అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో పనిచేయడం జరిగిందన్నారు.తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా నమ్మిన పార్టీ బిజెపి నేడు తన పనిని గుర్తించి అన్నమయ్య జిల్లా నూతన అధ్యక్షులుగా నియమించడం జరిగిందన్నారు.బిజెపిలో కష్టపడే కార్యకర్తలను గుర్తించి తగిన ప్రాధాన్యత తగిన సమయంలో వస్తుందనడానికి జిల్లా అధ్యక్షుడు నియామకమే ప్రధాన నిదర్శనమని తెలిపారు.ఇందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి,రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మధుకర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ జోనల్ ఇన్చార్జ్ దయాకర్ రెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు,సీనియర్ నాయకులు చల్లపల్లి నరసింహ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్రమశిక్షణే విధ్యార్థికీ భవిష్యత్

## - తహసీల్దార్ మోహన్ కృష్ణవేంపల్లె




నేటి పత్రిక ప్రజాసీమ:క్రమశిక్షణ ఉంటేనే విద్యార్థికి భవిష్యత్ ఉంటుందని వేంపల్లె తహసీల్దార్ పయ్యావుల మోహన్ కృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ పాఠశాలలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ అంబేద్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని, చదువుల్లో మరింత రానించి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చెడు అలవాట్లకు దురంగా మెలిగి చదువుల పట్ల మక్కువ పెంచుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. అలాగే క్రీడల పట్ల కూడా మక్కువ చూపి రానించాలని, తాము చదివే పాఠశాలలకు గుర్తింపు తేవాలన్నారు. శిక్షణ తరగతుల్లో ప్రతిభ చూపుతున్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉచిత శిక్షణ నిర్వాహకులు రామాంజనేయులు, పుల్లయ్య, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# మానవత సేవలే ప్రధాన లక్ష్యం

## -నూతన భవనం ప్రారంభం



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:మానవత సేవలే ప్రధాన లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేసినట్లు వేంపల్లె శాఖ చైర్మన్ బంగ్రెడ్డి చక్రపాణిరెడ్డి, అధ్యక్షుడు డా.యోగీశ్వర్ బాబు లు అన్నారు. శుక్రవారం రాజీవ్ నగర్ కాలనీలో బాడీ ఫ్రీజర్లు ఉంచేందుకు నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవత సంస్థ నిరంతరం పేద ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. దాతల సహకారంతో నూతన భవనాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో బాడీ ఫ్రీజర్ అందుబాటులో ఉ ఒడడం వల్ల బాధిత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. అలాగే దాతల సహకారం మరవలేనిదని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డా.రంగయ్య, బాలాజీ, సుభాష్, గంగయ్య, రామమునిరెడ్డి, దాతలు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

## - డిప్యూటీ డీఎంహెచ్ఓ డా.ఖాజా మొహిద్దీన్
## -మే16న జాతీయ డెంగ్యూ దినోత్సవం



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:డెంగ్యూ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా డెంగ్యూ నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పులివెందుల ప్రాంతీయ డిప్యూటీ డిఎంహెచ్ఓ డా.ఖాజా మొహిద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన తాళ్లపల్లి పిహెచ్సికి విచ్చేసి మాట్లాడారు. ఈనెల 16న జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూను జయిద్దాం, సురక్షిత సమాజాన్ని నిర్మిద్దాం అని పిలుపునిచ్చారు. అనంతరం డెంగ్యూ వ్యాప్తి చేసే ఎడిస్ దోమలు పగటి పూట మాత్రమే కుడుతాయని, చిన్న పిల్లలకు సాధ్యమైనంత వరకు శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు వేయాలన్నారు. అలాగే ఆ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత చర్యలు తప్పనిసరి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు పృథ్వీకుమార్ రెడ్డి, మలేరియా అధికారి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# అనాథలను ఆదుకోవడం మానవ ధర్మం

## -అనాథలను ఆదుకోవడం మానవ ధర్మం



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:అనాథలను ఆదుకోవడం మానవ ధర్మమని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం అమెరికాలో స్థిరపడ్డ తన మిత్రుడు తొండమనాటి సుభాష్ కుమార్తె హాసిని జన్మదిన వేడుకలను అనాథ వృద్ధుల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం అనాథవృద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని, వీరికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య, బిజెపి నాయకులు పుష్పలత, రవియాదవ్, మిత్రులు సలీం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కౌశలం సర్వేలో ఎంపికైన 24 మందికి తిరుపతిలో ఇంటర్వ్యూలు

## - ఎంపీడీవో భానుప్రసాద్



కలకడ(ప్రజా సీమ) ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వర్ణ గ్రామ సిబ్బంది గత ఏడాది నిర్వహిం చిన వర్క్ ఫ్రం హోం కౌశలం సర్వే ద్వారా ఎం పికైన అభ్యర్థుల కు ప్రత్యేక పరీక్షలు నిర్వహించినట్లు కలకడ ఎంపీడీవో భాను ప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణులైన కలకడ మండలానికి చెందిన 24 మంది అభ్యర్థులకు తిరుపతిలో ప్రముఖ కంపెనీలు ఓరల్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.మే 30 నుండి జూన్ 3 వరకు తిరుపతిలో జరిగే ఈ ఇంటర్వ్యూలకు సంబంధించి అభ్యర్థులకు ఇప్పటికే షెడ్యూల్ పంపినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను క్రింది ప్రముఖ సంస్థలు ఇంటర్వ్యూ చేయనున్నాయి.ఝు జుశ్రీవఱీతీశ- అఎం -- మొబైల్ అసెంబ్లీ ఆపరేటర్ పోస్టులు౼ఎవెవత్ఐతీవ -- అకౌంటింగ్ అసోసియేట్ ఒ టెక్నికల్ సపోర్ట్ వాయిస్ పోస్టులు.ఇన్ఫోసిస్ ఇంటర్నేషనల్ కస్టమర్/టెక్నికల్ సపోర్ట్ వాయిస్ ఒ నాన్ వాయిస్ పోస్టులు ఇంటర్వ్యూలకు హాజరుకావాల్సిన అభ్యర్థులకు సంబంధిత కంపెనీలు ఫోన్ కాల్స్ ద్వారా సమాచారం అందజేయడంతో పాటు మండల పరిషత్ మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది కూడా ప్రత్యేక సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కలకడ -- 5 మంది,కె.దొడ్డిపల్లి -- 4 మంది,కోన -- 4 మంది,కోటగుడిబండ -- 4 మంది,దిగువపాలెం--3 మంది దేవలపల్లి -- 1 వ్యక్తి, కదిరాయచెరువు-1వ్యక్తి,పాపిరెడ్డిగారిపల్లి- 1 వ్యక్తి యర్రయ్యగారిపల్లి -- 1 వ్యక్తులు ఎంపికైనారని ఎంపికైన 24 మంది అభ్యర్థులు తప్పనిసరిగా తిరుపతిలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలకడ ఎంపీడీవో సూచించారు.

# మునగ ప్రాసెసింగ్ యూనిట్ యంత్రాలు రాక



వీరబల్లి (ప్రజా సీమ):లిగతంలో అన్నమయ్య జిల్లాలో రెండు మునగ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు కాగా అందులోఒకటి వీరబల్లి. అప్పటి నుంచి రైతులు ఈ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం ఎదురుచూస్తూ వచ్చారు. అనుకు న్నట్లే రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజుచొరవతో శుక్రవారం ప్రాసెసింగ్ యూనిట్ యంత్రాలు వీరబల్లికు చేరాయి. త్వరలోనే ఆ యూనిట్ కు అన్ని సౌకర్యాలు సమకూర్చడం ద్వారా త్వరలోనే ప్రారంభం కానుంది. ఇప్పటికే రైతులు మండలంలో మునగ పంటను సాగు చేశారు. అంతేగాక అనేకమంది రైతులు మునగ పంటను సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. యంత్రాలు వీరబల్లి కి చేరడంతో మండల టిడిపి అధ్యక్షులు ఎం భానుగోపాల్ రాజు, సీనియర్ నాయకులు వై రెడ్డప్ప రెడ్డి, నాగ సుబ్బయ్య నాయుడు, రామ్మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగార్జున ఆచారి, ఏపిఎం ఖాదర్ వలీ, సిసి గంగాధరం,రాచ రాయుడు, రమణ, విజయ భాస్కర్ లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలోవెలుగు సిబ్బంది, రైతు సమాఖ్య సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల

## - టాప్ 20లో నిలిచిన విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్స్
## - ప్రో చాన్సలర్ నాదెళ్ల ద్వారకానాథ్ వెల్లడి







కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వారు ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకై నిర్వహించిన మిట్స్ యూనివర్సిటీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలను శుక్రవారం రోజున యూనివర్సిటీ ప్రో చాన్సలర్ నాదెళ్ల ద్వారకానాథ్ ఆన్లైన్ ద్వారా విడుదలచేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్,రిజిస్ట్రార్ డాక్టర్ ప్రదీప్ కుమార్,డైరెక్టర్ అడ్మిషన్స్ డాక్టర్ దీపాంకర్ రాయ్,సి.ఓ.ఈ డాక్టర్ సాయి కుమార్,సి.టి.ఓ సనత్ హెగ్డే,సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మారుతీ ప్రసాద్ తదితరులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాదెళ్ల ద్వారకానాథ్ మాట్లాడుతూ మే 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఈ పరీక్షను సుమారు 13 సెంటర్లలో నిర్వహించినట్లు,సుమారు 5000 మందికి పైగా విద్యార్థులు ఈ సెట్ రాసినట్లు ఆయన అన్నారు. యూనివర్సిటీ తరుపున టాప్ 20 ర్యాంకర్లకు మెరిట్ స్కాలర్షిప్స్ అందజేయనునట్లు ఆయన అన్నారు. ఈ పరీక్షలో మదనపల్లెకు చెందిన పఠాన్ జుల్ఫికర్ ఖాన్ మొదటి ర్యాంక్ సాధించినట్లు ఆయన అన్నారు. పెదకాము రిషిత రెడ్డికి రెండవ ర్యాంక్,నాసన్న రామ్ చరణ్ రెడ్డి మూడవ ర్యాంక్,వాల్మీకి ఋషిక్ నాలుగవ ర్యాంక్ పొందినట్లు ఆయన అన్నారు. ఎస్.ఎండీ మొయిన్ ఐదో ర్యాంక్,పూటక హర్షనందన్ ఆరవ ర్యాంక్,హెచ్.రవళికకు ఏడవ ర్యాంక్,నల్లజాల రవిచంద్ర నాయుడు ఎనిమిదవ ర్యాంక్,గొర్లప్పగారి హాసిని తొమ్మిదవ ర్యాంక్,వేమల యతీష్ పదవ ర్యాంక్ లభించినట్లు ఆయన అన్నారు. కమ్మలూరి తబసుమ్,నవదీప్ తేజ,వి.మహాలక్ష్మి,జయవర్ధన్ జె.యన్,కొండా భానుతేజ,విరూపాక్షి తేజస్విని,షేక్ సమీనా,కేసర్ల మురారి,షేక్ మహమ్మద్ జుబేర్ మరియు ఫసీహా ఫాతిమా పరికీ సయ్యదులు వరుసగా 11వ ర్యాంక్ నుంచి 20వ ర్యాంకులు సాధించినట్లు ఆయన అన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్ మాట్లాడుతూ యూనివర్సిటీ సెట్ రాసి అగ్రస్థానంలో నిలిచిన టాప్ 20 విద్యార్థులకు మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి 100 శాతం ఫీజు స్కాలర్షిప్ నాలుగు సంవత్సరాలు అందజేస్తామని,ర్యాంక్ 2 నుంచి 5 వరకు విద్యార్థులకు 75 శాతం,ర్యాంక్ 6 నుంచి 10 వరకు విద్యార్థులకు 50 శాతం మరియు ర్యాంక్ 11 నుంచి 20 వరకు విద్యార్థులకు 25 శాతం ఫీజు స్కాలర్షిప్స్ అందజేయనున్నట్లు ఆయన అన్నారు. మిట్స్ సెట్ రాసిన విద్యార్థులకు త్వరలోనే కౌన్సిలింగ్ జరుగుతుందని ఆయన అన్నారు. టాప్ లో నిలిచిన విద్యార్థులను యూనివర్సిటీ ఫౌండర్ మరియు ఛాన్సలర్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి,ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల అభినందనలు తెలియజేశారు. ఫలితాల విడుదల కార్యక్రమంలో హేమంత్ కుమార్,రియాజ్ అలీలు పాల్గొన్నారు.

# ఆలయాల వైభవ పునరుద్ధరణకు కొత్త అధ్యాయం

## - పల్నాడు -- గుంటూరు దేవాలయాల్లో వాసిరెడ్డి వంశ ధార్మిక బాధ్యతల స్వీకారం
## - కేతవరం నుంచి ప్రారంభమైన ఆధ్యాత్మిక యాత్ర
## - నాలుగు ప్రముఖ దేవాలయాలకు ఒకేరోజు అనువంశిక ధర్మకర్తగా బాధ్యతలు
## - ఆలయాల అభివృద్ధి, సనాతన ధర్మ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి





ఏపీ బ్యూరో(ప్రజా సీమ):పల్నాడు - గుంటూరు ప్రాంతాల్లోని చారిత్రక దేవాలయాల వైభవ పునరుద్ధరణకు కొత్త అధ్యాయం ప్రారంభమైనట్లు కనిపిస్తోంది. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పలు ప్రముఖ ఆలయాలకు అనువంశిక ధర్మకర్తగా శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ బహదూర్ మన్నే సుల్తాన్ గురువారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించడం ఆ ప్రాంతవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేవలం పరిపాలనా ప్రక్రియగా కాకుండా, వంశపారంపర్య ధార్మిక బాధ్యతల పునరుద్ధరణగా ఈ పరిణామాన్ని స్థానిక భక్తులు భావిస్తున్నారు. కేతవరం నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు ఉదయం కేతవరం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రధాన ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించబడింది. అక్కడి నుంచి రావెల గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం, పొన్నెకల్లు గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, కొలనుకొండ భోగేశ్వరస్వామి దేవాలయాలకు వరుసగా వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. ప్రతి ఆలయంలో ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనాలు, భక్తుల స్వాగతాలతో కార్యక్రమాలు ఆధ్యాత్మికవాతావరణంలో సాగాయి. గ్రామాల్లో ఘన స్వాగతం రావెల, పొన్నెకల్లు తదితర గ్రామాల్లో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలతో స్వాగతం పలికారు. వాసిరెడ్డి వంశం ఆలయ పరిరక్షణలో గతంలో పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ పలువురు భక్తులు భావోద్వేగంగా స్పందించారు. ఆలయాల పునరుద్ధరణ, నిత్యనైవేద్యాలు, ఉత్సవాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల మెరుగుదల వంటి అంశాల్లో కొత్త దిశ కనిపిస్తోందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యం బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీమంత్ రాజా వాసిరెడ్డి సుధా స్వరూప్ మాట్లాడుతూ ఆలయాలు కేవలం ఆరాధనా కేంద్రాలు మాత్రమే కాదని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల మూలస్తంభాలని పేర్కొన్నారు. దేవాలయాల వైభవ పునరుద్ధరణకు, సనాతన ధర్మ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే కాకుండా, ఆధ్యాత్మిక కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. రాజకీయ, సామాజిక వర్గాల దృష్టి ఈ కార్యక్రమానికి అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆలయ పరిపాలనలో వంశపారంపర్య వ్యవస్థకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతోందనే చర్చ కూడా ఈ సందర్భంగా వినిపించింది. వాసిరెడ్డి వంశంపై మళ్లీ చర్చ అమరావతి సంస్థానం, వాసిరెడ్డి వంశ చరిత్ర, దేవాలయాల పరిరక్షణలో ఆ కుటుంబం పోషించిన పాత్రపై కూడా ఈ పరిణామంతో మళ్లీ చర్చ మొదలైంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పురాతన ఆలయాలకు పరిపాలనా బలం, ఆర్థిక సహకారం, సంప్రదాయ పరిరక్షణ అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్త బాధ్యతల స్వీకారం భవిష్యత్తులో ఆలయాల అభివృద్ధికి ఎంతవరకు దోహదపడుతుందో చూడాల్సి ఉంది.

# పీలేరులో ఘనంగా ముగిసిన రెండవ రోజు "భీష్మ ప్రతిజ్ఞ" హరికథా కార్యక్రమం



పీలేరు (ప్రజా సీమ)పీలేరు పట్టణంలో నిర్వహిస్తున్న మహాభారత హరికథా కార్యక్రమం రెండవ రోజు ఘనంగా కొనసాగింది. ఈ సందర్భంగా భారతరాణి సరస్వతి హరిదాసు హరికథా రూపంలో వినిపించిన "భీష్మ ప్రతిజ్ఞ" ఘట్టం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మహాభారతంలోని ఈ మహోన్నత ఘట్టాన్ని భక్తి, భావోద్వేగం, ఆధ్యాత్మిక సందేశాలతో కలిపి వినిపించడంతో సభా ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భీష్ముడు తన తండ్రి శాంతనుడి కోరిక నెరవేర్చేందుకు జీవితాంతం బ్రహ్మచర్యం పాటిస్తానని చేసిన ప్రతిజ్ఞను భారతరాణి సరస్వతి హరిదాసు ఎంతో హృద్యంగా వివరించారు. హరి కథలో భాగంగా చెప్పిన పద్యాలు, శ్లోకాలు, వివరణలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముఖ్యంగా భీష్ముడి త్యాగం, ధర్మనిష్ఠ, కుటుంబ గౌరవం కోసం చేసిన త్యాగాన్ని వివరిస్తూ చెప్పిన సందేశాలు అందరినీ ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో భక్తి గీతాలు, సంగీతం, సంప్రదాయ వాద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై హరికథను ఆసక్తిగా వీక్షించారు. పలువురు భక్తులు భారతీయ సంస్కృతి, పౌరాణిక విలువలను యువతకు పరిచయం చేసే ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని అభిప్రాయపడ్డారు .నిర్వాహకులు మాట్లాడుతూ మహాభారతం వంటి ఇతిహాసాల ద్వారా ధర్మం, నీతి, కుటుంబ విలువలు సమాజానికి చేరవేయాలనే ఉద్దేశంతో ఈ హరికథా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు మహాభారతంలోని విభిన్న ఘట్టాలను హరికథా రూపంలో వినిపించనున్నట్లు వెల్లడించారు.

# ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడడమే లక్ష్యం

## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్పష్టం
## - నాయకులతో కలిసి డ్రిల్ చేసిన తాగునీటి బోర్లు ప్రారంభం





మదనపల్లె (ప్రజా సీమ) : వేసవిలో తాగునీటి సమస్య నివారణ కోసం మదనపల్లి గ్రామీణ మండలం కోళ్లబైలు పంచాయతీ సచివాలయం ఎదురుగా,కోళ్లబైలు -1 పంచాయతీలోని మసీదు సమీపాన డ్రిల్ చేసిన తాగునీటి బోర్లను,మదనపల్లి మున్సిపల్ పరిధిలోని రింగ్ రోడ్ ఇంజనీర్స్ కాలనీ నందు నూతనంగా డ్రిల్ చేసిన బోర్వెల్ కు ఏర్పాటు చేసిన మోటార్లను ఎమ్మెల్యే షాజహాన్ బాషా శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి మండల అధికారులు వెంటరాగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మోటార్లు ఆన్ చేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో మదనపల్లి నియోజకవర్గంలో పెద్దఎత్తున బోరు మోటర్లు డ్రిల్ చేసి నూతనంగా మోటార్లను ఏర్పాటు చేయడం జరుగుతోందని,వేసవిలో తాగనీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల,డిఈ శ్రావణి,తెలుగుదేశం నాయకులు కమలామద్రి కృష్ణ,రాటకొండ భారతి,శ్రీరామ నాగమణి,రాటకొండ శ్రీనివాసులు నాయుడు,రమేష్ రెడ్డి,నవీన్ చౌదరి,ఏఎంసీ వైస్ చైర్మన్ ఆంజనేయులు,నాయిబ్రాహ్మణ సంఘం మంజునాథ్,బాలమాలి శేఖర్,రామిశెట్టి రెడ్డి కేశవ,రాజేష్,మంజునాథ్,మోహన్ రెడ్డి తెలుగుదేశం పార్టీ నేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# సొంత నిధులతో తాగునీటి సమస్య పరిష్కారం

## – టిడిపి నేత జయరామిరెడ్డికీ కాలనీ ప్రజలు కృతజ్ఞతలు



వేంపల్లె నేటి పత్రిక ప్రజాసీమ:గత వారం రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానిక జగనన్న కాలనీ ప్రజలకు, టిడిపి సీనియర్ నేత జయరామిరెడ్డి తన సొంత నిధులతో సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీంతో ఆ కాలనీ ప్రజలు జయరామిరెడ్డికీ కృతజ్ఞతలు తెలిపారు. తాగునీటి సరఫరా చేసే మోటార్ చెడిపోయిందని, దీంతో తమ కాలనీ సమస్య తలెత్తిందని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన.. దగ్గరుండి మరమ్మతుల పనులు చేపట్టాలని టిడిపి యువనేత శివకృష్ణారెడ్డికీ సూచించారు. తన సొంత నిధులతో సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల సురేష్, రామాంజీ, రమణ, యోగీశ్వర రెడ్డి, అంజీ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కాలనీలో బడి పిలుస్తుంది

## -ఎంఈఓ ఈశ్వరయ్య



చిట్వేలి(ప్రజా సీమ):ప్రతి బడి ఈడు పిల్లలు బడికి రావాలని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని ప్రభుత్వం అన్ని విధాల ఏర్పాట్లు చేస్తుందని, ఎంఈఓ ఈశ్వరయ్య, క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయుడు దుర్గరాజు, అన్నారు. చిట్వేలి మండల పరిధిలోని తిమ్మాయపాలెం పంచాయతీ ఇందిరమ్మ యానాది కాలనీలో బడి పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువుకోవడానికి ప్రభుత్వం పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. గిరిజన కాలనీలో నివాసముంటున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని తెలిపామన్నారు. పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పాఠశాలలకు దూరంగా ఉన్న పిల్లలకు అవగాహన కల్పించామన్నారు. చిట్వేలు మండలం వ్యాప్తంగా యానాది కాలనీలలో ఆధార్ కార్డులు లేని పిల్లలు ఎక్కువ శాతం ఉన్నట్లు తెలిసింది అన్నారు. ప్రస్తుతానికి ఆధార్ కార్డులు లేని విద్యార్థుల వివరాలను తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ క్రాఫ్ట్ టీచర్ పెంచల్ దాస్, సి ఆర్ పి చంద్రశేఖర్, గిరిజన కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ కాలనీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటుగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి

## -శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు



మదనపల్లె (ప్రజా సీమ) : కో- ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటుగా డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మదనపల్లె పట్టణం సొసైటీ కాలనీకి చెందిన డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి కో - ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటుగా నియమించబడటంపై పుర ప్రముఖులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఇటీవల జరిగిన అసోసియేషన్ సమావేశంలో డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారిని వైస్ ప్రెసిడెంటుగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ మేరకు కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులు ఆర్.రాజశేఖర్ రెడ్డి నియామక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా భాస్కరాచారి మాట్లాడుతూ సొసైటీ కాలనీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తామన్నారు.అలాగే తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.

# తన కుమారుడి జ్ఞాపకార్థం చైతన్య సంస్థలో అన్నవితరణ

## - దాతలను సన్మానించిన జనరల్ సెక్రెటరీ కవితా రాణి




మదనపల్లె (ప్రజా సీమ) : తిరుపతి రోడ్డు,దేవత నగర్ నాలుగో నెంబర్ రోడ్డు నందు గల చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థలోని చిన్నారులకు మరియు చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నడుప బడుతున్న బీకేపల్లిలోని ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మదనపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సిఆర్పిగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి శేఖర్ రెడ్డి తన కుమారుడు కీర్తిశేషులు రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి (తరిగొండ నాని) జ్ఞాపకార్థం పిల్లలు,వృద్ధులకు పోషక విలువలతో కూడిన మాంసాహార భోజనాన్ని అన్నదాన వితరణ చేశారు.ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రెటరీ కవిత రాణి మాట్లాడుతూ కీర్తిశేషులు రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని అలాగే భగవంతుని ఆశీర్వాదాలు,ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు,నిండు నూరేళ్లు రెడ్డిశేఖర్ కుటుంబ సభ్యులపై ఎప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ సంస్థ జ్ఞాపికతో కృతజ్ఞతలు తెలియజేశారు.అనంతరం రెడ్డి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ నా కుమారుడు మా నుండి దూరమైన ఆ జ్ఞాపకాలు మా నుండి దూరం కాలేదని,ఇంత మంది చిన్నారులు,వృద్ధులకు అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.భవిష్యత్తు లోను చైతన్య సంస్థకి తనవంతు సహాయ, సహకారాలు అందిస్తానని స్పష్టం చేశారు.

# రాజంపేట టిడిపి కార్యాలయంలో కార్యకర్తల సమావేశం

## -టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి







సిద్ధవటం ప్రజా సీమ :రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శుక్రవారం మధ్యాహ్నం కార్యకర్తల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారం మోహన్ రెడ్డి మాట్లాడుతూ మే 27 28 29 తేదీ జరగబోవు మహానాడులో సిద్ధవటం మండల సమస్యలను మహానాడులో తీర్మానం చేయాలని రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని మండలంలోని జ్యోతి -ఖాదర్ బంగ్లా బ్రిడ్జి , నిర్మాణం కొరకు మరియు సిద్ధవటం ఫారెస్ట్ చెక్ పోస్ట్ రాత్రి వేళలో వాహనాలు నిలుపుదలపై ఎత్తేయాలని మహానాడులో తీర్మానించాలని ఇన్చార్జి దృష్టికి తీసుకెళ్లాలని మోహన్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు, సిద్ధవటం సింగల్ విండో అధ్యక్షులు, దారపునేని దశరథ రామానాయుడు, శ్రీ నిత్య పూజ స్వామి దేవస్థానం చైర్మన్, జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి, వీరనాల రామచంద్ర, టిడిపి నాయకులు, హరి ప్రసాద్, రవీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు

# మిగులు సీట్లకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానం

## - జవహర్ నవోదయ ప్రిన్సిపల్ ఎం.గీత వెల్లడి




మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా,మదనపల్లె మండలం,వలసపల్లెలో గల పి.యం.జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-2027 విద్యా సంవత్సరమునకు 11వ తరగతిలో ఖాళీగా ఉన్న కామర్స్ స్ట్రీమ్ సీట్లు భర్తీ చేయుటకు 2025-2026 విద్యా సంవత్సరములో 10వ తరగతి పాసైన అర్హత గల విద్యార్థులు ఈనెల 23వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవలసిందిగా ప్రిన్సిపాల్ ఎం.గీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.ఆసక్తి గల విద్యార్థులు విద్యాలయ కార్యాలయానికి (కార్యాలయం పనివేళల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు) తమ దరఖాస్తును 23వ తేదీ లోపుగా సమర్పిం చవలెనన్నారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఒంటిమిట్టపై సీఎం ప్రత్యేక దృష్టి

## -పేదలకు భూముల పంపిణీకి భారీ కార్యాచరణ -రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి జగన్మోహన్‌రాజు -సాలాబాద్‌లో ప్రజాదర్బార్‌కు ప్రజల వెల్లువ -సమస్యల పరిష్కారానికి హామీలు











ఒంటిమిట్ట,(ప్రజా సీమ):ప్రజా సమస్యలను గ్రామ స్థాయిలోనే గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకునే లక్ష్యంతో ఒంటిమిట్ట మండలం సాలాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజాస్పందనతో సాగింది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి జగన్మోహన్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరు, తాగునీరు, రహదారులు, పింఛన్లు, భూముల వివాదాలు, పశువుల దొడ్లు, సచివాలయ సేవలు వంటి పలు అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ ప్రతినిధి సాలాబాద్ బుజ్జి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ.. ఒంటిమిట్ట అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. మండలానికి శాశ్వత నీటి వసతులు కల్పించేందుకు గతంలో శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఆ పథకానికి మరమ్మతుల కోసం రూ.13 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఒంటిమిట్టలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.రాజంపేట నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంపిణీ చేసే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లక్ష ఎకరాల భూమిని సేకరించి దాదాపు 30 వేల పేద కుటుంబాలకు అందించే అవకాశం ఉందన్నారు. అయితే కొందరు నాయకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ, వాటి పరిరక్షణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. పేదల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలు, పేదల భూములు, పశువుల దొడ్లను సైతం ఆక్రమించే స్వభావం వైసీపీ నాయకులదేనని ఆయన ఆరోపించారు. ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లోని సామూహిక స్థలాలను రక్షించి నిజమైన అర్హులకు అందేలా చర్యలు చేపడతామని తెలిపారు.వైసీపీ పాలనలో గ్రామాల్లో ఫ్యాక్షన్ రాజకీయాలు పెరిగి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయని విమర్శించిన జగన్మోహన్‌రాజు.. అలాంటి రాజకీయాలకు ముగింపు పలికే దిశగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రజలకు భద్రత, అభివృద్ధి, పారదర్శక పాలన అందించడమే తమ లక్ష్యమని చెప్పారు.మండల తహసీల్దార్ దామోదరరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలకు అధికారులను నేరుగా కలిసే వేదికగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని వివరించారు.జడ్పీటీసీ ముద్దుకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూముల దోపిడీ పెరిగిందని ఆరోపించారు. సాలాబాద్ పంచాయతీ పరిధిలో రూ.65 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి, ఎంపీపీ ప్రతినిధి బుజ్జి, ఎస్వీ రమణ, బొబ్బిలి రాయుడు, ఆలూరు వెంకటసుబ్బయ్య, తుమ్మలకుంట్ల ఈశ్వరయ్య, శివారెడ్డి, రాజగుడిపల్లి రమణ, ప్రతాప్, గొల్లపల్లి మల్లి, సుబ్బారెడ్డి, జలగం బాలకృష్ణ, రోశయ్య, లక్ష్మీరెడ్డి, చౌడయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మౌలాలి, పంచాయతీ కార్యదర్శి జానకి, డాక్టర్ భావనరెడ్డి, టీటీడీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.టీడీపీలోకి యువత చేరికప్రజాదర్బార్ అనంతరం పలువురు యువకులు జగన్మోహన్‌రాజు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సాలాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు.

# ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ నిర్మాణాలు

## -రాజంపేట సబ్ కలెక్టర్ భావన




సిద్దవటం ప్రజా సీమ :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్మార్ట్ కిచెన్ లను నిర్మిస్తోందని రాజంపేట సబ్ కలెక్టర్ భావన తెలిపారు. మండలకేంద్రమైన సిద్ధవటం ఎగువపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పక్కన నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ ను శుక్రవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాలో స్మార్ట్ కిచెన్ లను పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్నారన్నారు. సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో నిర్మాణాలు పూర్తయితే మండలంలోని అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు ఇక్కడి నుంచే మధ్యాహ్న భోజనం సరఫరా జరుగుతుందన్నారు. త్వరితగతిన స్మార్ట్ కిచెన్ నిర్మాణాలు పూర్తి చేయాలని సంబందిత గుత్తేదారుతో మాట్లాడాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవి లత, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, డిప్యూటీ ఎంపీడీఓ మెహెతాబ్ యాస్మిన్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్, ఎంఈఓ -2 అరుణ జెడ్పీ హెచ్ఎం సునీత, డిఎల్డీఓ తదితరులు పాల్గొన్నారు.

# అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ దొర జయంతి

మే 15(గుడివాడ):ఉభయ గోదావరి జిల్లాల రైతుల పాలిట ఆరాధ్య దైవంగా, అపర భగీరథుడిగా పేరుగాంచిన సర్ ఆర్థర్ కాటన్ దొర జయంతిని ప్రతి సంవత్సరం కళాశాలలో ఘనంగా నిర్వహిస్తున్నామని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు తెలిపారు. ల 19వ శతాబ్దంలో కరువు కాటకాలు, గోదావరి వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి దుస్థితిని చూసి చలించిపోయిన కాటన్ దొర, బ్రిటీష్ పాలకుల అడ్డంకులను అధిగమించి తన ఇంజనీరింగ్ ప్రతిభతో ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించారని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రామారావు పేర్కొన్నారు.ధవళే శ్వరం ఆనకట్ట ప్రాంత తలరాతను మార్చివేసిందని, అతివృష్టి--అనావృష్టులతో ఇబ్బందులు ఎదుర్కొం టున్న గోదావరి ప్రాంతాన్ని సస్యశ్యామలంగా మార్చి, వందలాది గ్రామాలకు త్రాగునీరు అందించి గోదావరి ప్రజల హృదయాలలో కాటన్ దొర చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు.

## రోగుల వద్ద డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

**- హెచ్చరించిన ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా**





మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లి సర్వజన బోధన ఆసుపత్రికి వచ్చే రోగులు,వారి బంధువులు వద్ద వైద్య సేవల కోసం కొంతమంది సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే షాజహాన్ బాషా హెచ్చరించారు. శుక్రవారం మదనపల్లి ఆసుపత్రిలో పర్యటించిన ఎమ్మెల్యే ఆసుపత్రి సిబ్బంది,అధికారులతో నిర్వహించిన సమీక్షలో వివిధ అంశాలపై చర్చించారు.ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు కొందరు వైద్య చికిత్సల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు,బంధువుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారని,అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని,తమ దృష్టికి రావడం జరిగిందన్నారు.అటువంటి వారిని తక్షణం విధుల నుండి తొలగించాలని అధికారులకు సూచించారు.సేవా భవంతో వైద్య సేవలు అందించేందుకు గౌరవమైన వృత్తిలో ఉన్న ఉద్యోగులు బాధ్యతతో రోగులకు సేవలు అందించాలని సూచించారు.తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సంపు నిర్మించి దీర్ఘకాలంగా మేలుకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపామని తెలిపారు.కొందరు సిబ్బంది తమ విధులను పక్కనపెట్టి ఇతర లావాదేవీలకు పాల్పడితే ఆస్పత్రి విధుల నుండి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ రాధిక,నర్సింగ్ సూపరింటెండెంట్, తెలుగుదేశం నాయకులు రాటకొండ శ్రీనివాసులు నాయుడు,డ్యాన్స్ రెడ్డెప్ప,రాటకొండ భారతి పాల్గొన్నారు.

## 17న రాయలసీమ జోన్ వాల్మీకుల ఆత్మీయ సమావేశం

**- జయప్రదం చేయాలని వాల్మీకి నాయకుల పిలుపు**



మదనపల్లె (ప్రజా సీమ) : ఈనెల 17వ తేదీ అనగా (ఆదివారం) అన్నమయ్య జిల్లా వాల్మీకిపురంలో రాయలసీమ జోన్ వాల్మీకి నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వాల్మీకిపురం వాల్మీకి నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆత్మీయ కార్యక్రమానికి రాయలసీమ జోన్ పరిధిలోని కడప,కర్నూలు, అనంతపురం, హిందూపురం, తిరుపతి,చిత్తూరు,అన్నమయ్య జిల్లాల నుండి వాల్మీకి నాయకులు హాజరవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు వాల్మీకిపురం పట్టణం తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం సమీపంలో ఉన్నటువంటి వాల్మీకి విగ్రహం దగ్గర పూజా కార్యక్రమంతో ప్రారంభమవుతుందని తదనంతరం కోర్టు ఎదురుగా ఉన్నటువంటి ఆర్.ఎమ్.ఎమ్ కింగ్స్ ప్యాలెస్ నందు ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సమావేశానికి వాల్మీకి కుటుంబ సభ్యులందరూ పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పెట్రోల్,డీజిల్ ధరల పెంపు బిజెపి చేతకానితనానికి నిదర్శనం

**- అన్నివర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం,రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే దేశం సుభిక్షం, కిసాన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి**



మదనపల్లె (ప్రజా సీమ) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి విస్తృతంగా పర్యటనలు చేస్తున్నారు.పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలమ్మ, కిసాన్ కాంగ్రెస్ పార్టీ జాతీయ కో–ఆర్డినేటర్ నీలం రమేష్ సూచనలు మేరకు అన్నమయ్య జిల్లాలో సింగం రామకృష్ణారెడ్డి నిత్యం పర్యటిస్తూ రైతుల సమస్యలనుతెలుసుకుంటున్నారు.రైతులు సాగుచేసిన టమోటా, పచ్చిమిర్చి, బొప్పాయి,అరటి,వరి, మొక్కజొన్న,మామిడి,అల్లనేరేడు పంటలను పరిశీలిస్తూ,ప్రతి పంటకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.ముఖ్యంగా మదనపల్లి,పుంగ నూరు,తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తున్నారు.ఈ నియోజకవర్గాల్లో ఉన్న రిజర్వాయర్లు,ప్రాజెక్టులను పరిశీలన చేస్తున్నారు.వరికి మద్దతు ధర కల్పించి,క్వింటాళ్ల ధరను గిట్టుబాటుకు కొనాలని,రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయకుండా వారి సంక్షేమం,అభివృద్ధి కోసం కృషి చేయాలని సింగం రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు.ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన తర్వాత పెట్రోల్,డీజిల్ ధరలను పెంచడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.పెంచిన పెట్రోల్,డీజిల్ ధరలను తగ్గించాలని సూచించారు.గతంలో స్వర్గీయ రాజీవ్ గాంధీ దేశప్రధానిగా ఉన్నప్పుడు యుద్ధవాతావరణం నెలకొంది.అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పెట్రోల్,డీజిల్,నిత్యావసర ధరలు పెంచకుండా దేశ ప్రజల పండుగ నిలిచారని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలు ఎన్ని వచ్చినా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవడం జరిగిందని,ప్రతి రైతుకు అనేక విధాలుగా మేలు జరిగిందని గుర్తుచేశారు.ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు,పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించిన విషయాన్ని తెలియజేశారు.రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే ప్రతి రైతుకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.సింగం రామకృష్ణారెడ్డి పర్యటనతోరైతులోసంతోషాలు నెలకొంటున్నాయి.తమ సమస్యల పట్ల స్పందిస్తున్నారని కృతజ్ఞతలు తెలిపారు.సింగం వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగూ నాయక్,చెన్నకృష్ణ,సరస్వతమ్మ,మల్లికా రాణి,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికగా పనిచేయడమే ప్రజా దర్బార్ లక్ష్యం

**ముక్కా రూపానంద రెడ్డి**





రైల్వే కోడూరు( ప్రజా సీమ )తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని స్థానిక రాఘవ రాజాపురం పంచాయతీలో ఉన్న రైల్వే కోడూరు టిడిపి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మరియు కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు మండలాల్లోని తమ సమస్యలను విన్నవించుకోవడం కోసం పార్టీ కార్యాలయం చేరుకొని ముక్కా రూపానంద రెడ్డి విన్నతి పత్ర రూపంలో అందజేయడం జరిగింది. ఇందులో ముఖ్యంగా రెవెన్యూ మరియు విద్యుత్ శాఖకు సంబంధించి సమస్యలు ఉత్పన్నం కాగా వాటిని చరవాణి ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను సాధ్యమైన మేర వారి సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు రూపానంద రెడ్డి చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా గౌరవనీయులు లిముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూలి గత ఎన్నో నెలలుగా ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా ఈ శుక్రవారం కూడా నిర్వహించడం జరిగిందని ఇక్కడ ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడం కోసం రావడం జరుగుతుందని వారి యొక్క సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత అధికార యంత్రాంగంతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చేయాలని తెలపడం జరుగుతుందని తెలియజేస్తూ, ముఖ్యంగా రెవెన్యూ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ మరియు జలవనరుల శాఖకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో వాటన్నిటిని కూడా కులంకషంగా చర్చించి న్యాయపరమైనటువంటి చర్యలు చేపట్టాలని రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎటువంటి సమస్య ఉన్నా కూడా ఏ శాఖలో సమస్య ఉత్పన్నమవుతుందో ఆ సమస్యకు సంబంధించి అధికారి కచ్చితంగా ప్రజలకు అండగా నిలబడి సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోర్డ్ సంస్థకి పిపి మహమ్మద్ అయూబ్ సహకారం వెలకట్టలేనిది

**- ఘనంగా సన్మానించిన సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ**



మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె రెండవ అదనప జిల్లా జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్,న్యాయవాది మహమ్మద్ అయూబ్ ను పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువా,పుష్పగుచ్ఛం ఘనంగా సన్మా నించారు.పోర్డ్ సంస్థ ప్రారంభించినప్పటి నుంచి సంస్థ స్వర్గీయ గోవిందప్ప మిత్రుడుగా అయూబ్ 30 సంవత్సరాలుగా ఎంతో సహాయ,సహకారాలనుపోర్డ్ సంస్థకి అందిస్తున్నారని గుర్తుచేశారు.పోర్డ్ సంస్థ అభివృద్ధిలో ఎం.అయూబ్ పాత్ర కూడా ఎంతో ఉందన్నారు.భవిష్యత్తులోను మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. న్యాయవాదులు కృష్ణారెడ్డి,నగేష్.బి.రమాదేవి, కృష్ణమూర్తి,సుజాత,ఉష,పోర్డ్ సంస్థ సిబ్బంది నిర్మల,హేమంత్,కుమార్, గౌరీ,ప్రభావతి పాల్గొన్నారు.

## ఏపీఎండిసిని పరిరక్షించుకుందాం..

**సీఐటియూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సి హెచ్ చంద్రశేఖర్**





రైల్వే కోడూరు( ప్రజా సీమ )తిరుపతి జిల్లా చిట్వేలు మండలంలో ఏపీఎండీసీ పరిరక్షణ కోసం సీఎం కి సంతకాల సేకరణ, 20వ తేదీ చలో ఏపీఎండిసి, కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ. ఈ సమావేశానికి సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు, సిహెచ్ చంద్రశేఖర్, సిఐటియు జిల్లా నాయకురాలు, ఎస్ శ్రీలక్ష్మి, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఓబిలి పెంచలయ్య. శిరీష, వసంత, అన్నపూర్ణ, ఉమా దేవి, చంద్రకళ,శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.


## ఘనంగా లింగసముద్రం మండల లో బుర్రా మధుసూదన్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలు

కందుకూరు, మే 15 :మాజీ శాసన సభ్యులు కందుకూరు నియోజక వర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా లింగసముద్రం మండలం గ్రామంలోని స్వర్గీయ డా. వైయస్ రాజశేఖరరెడ్డి గారి విగ్రహానికి పూలమాలలు అర్పించి, పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల పార్టీ అధ్యక్షులు నోటి వెంకటేశ్వరరెడ్డి , మండల ఎంపీపీ పెన్నా కిష్టయ్య గారు, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షఫీ గారు, యువజన విభాగం అధ్యక్షులు వంకాయలపాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ చీమల శ్రీనివాసులు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శ్రీ బుర్రా మధుసూదన్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించారు..

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక ప్రజాసీమ జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్



# రమణి కళ్యాణం.. పెళ్లి పాట అదిరింది



సినిమాకి పాటలు హిట్ అయితే ఆ సినిమాపై అంచనాలు ఆటోమేటిక్‌గా పెరుగుతాయి. ముఖ్యంగా పెళ్లి పాటలు ప్రేక్షకులకు వెంటనే కనెక్ట్ అయితే అవి ఫంక్షన్స్ నుంచి సోషల్ మీడియాలో వరకు ఎక్కడైనా వినిపిస్తుంటాయి. ఇప్పుడు రమణీ కళ్యాణం టైటిల్ సాంగ్ కూడా అలాంటి ఫీల్‌నే తీసుకొచ్చింది. ఇప్పటికే టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా, ఇప్పుడు టైటిల్ ట్రాక్‌తో ఆ ఆసక్తిని మరింత పెంచేసింది. వినగానే హుషారుగా అనిపించే ట్యూన్, పెళ్లి వాతావరణాన్ని గుర్తు చేసే విజువల్స్, ఫీల్‌గుడ్ ఎనర్జీ ఈ పాటకు పెద్ద ప్లస్ అయ్యాయి. పాట మొత్తం ఒక అందమైన పెళ్లి సంబరంలా సాగుతూ ప్రేక్షకులను మంచి మూడ్‌లోకి తీసుకెళ్తోంది. హరిచరణ్, రమ్యా బెహరా తమ వాయిస్‌తో పాటకు మంచి ఎనర్జీ తీసుకొచ్చారు. పూర్ణచారి రాసిన లిరిక్స్ వెంటనే గుర్తుండిపోయేలా ఉన్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ సూరజ్ ఎస్ కురుప్ ఇచ్చిన ట్యూన్ చాలా ఫ్రెష్‌గా అనిపిస్తోంది. ఒక్కసారి వింటే మళ్లీ వినాలనిపించేలా కంపోజ్ చేశారు. ముఖ్యంగా పెళ్లిళ్లు, ఫ్యామిలీ ఫంక్షన్స్‌లో ఈ సాంగ్ ఎక్కువగా వినిపించే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజువల్స్ కూడా పాటకు మరో హైలెట్‌గా నిలిచాయి. సూర్య వశిష్ట, దీప్షిక చంద్రన్ జంట చాలా క్యూట్‌గా కనిపించింది.

# డ్రాగన్ కోసం విదేశీ స్టంట్ మాస్టర్లు



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ప్రస్తుతం టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా సినీ అభిమానుల్లో హాట్ టాపిక్‌గా మారింది. దేవర తర్వాత ఎన్టీఆర్ నుంచి వస్తున్న సినిమా కావడం, సలార్ తర్వాత ప్రశాంత్ నీల్ చేతుల్లో రూపుదిద్దుకుంటున్న ప్రాజెక్ట్ కావడంతో ఈ కాంబినేషన్‌పై మొదటి నుంచే భారీ హైప్ నెలకొంది.

మాస్ ఆడియన్స్‌లో ఎన్టీఆర్‌కు ఉన్న అద్భుతమైన ఫాలోయింగ్, భారీ యాక్షన్ సినిమాలను స్టైలిష్‌గా తెరకెక్కించే ప్రశాంత్ నీల్ మార్క్ కలిసి ఈ ప్రాజెక్టును నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తాయనే నమ్మకం ఇండస్ట్రీ వర్గాల్లో కనిపిస్తోంది.

ముఖ్యంగా ఎన్టీఆర్ ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించనున్నాడనే టాక్ అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. ఇప్పటికే బయటకు వచ్చిన కొన్ని వర్కింగ్ స్టిల్స్, లీకైన మేకోవర్ వివరాలు చూస్తే, ఎన్టీఆర్ కెరీర్‌లో ఎన్నడూ చూడని విధంగా స్టైలిష్ మరియు స్లిమ్ అవతార్‌లో కనిపించడం ఫ్యాన్స్ ను ఎంతో ఎగ్జైట్ అయ్యేలా చేస్తోంది.


ఇప్పటికే పలు కీలక షెడ్యూళ్లను పూర్తి చేసుకున్న ఈ సినిమా తదుపరి షూటింగ్ షెడ్యూల్ హైదరాబాద్‌లో జరగనున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్‌ను పూర్తిగా హై ఓల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఇందులో ఎన్టీఆర్‌తో పాటు ప్రముఖ నటులు బిజూ మీనన్, ప్రకాష్ రాజ్ పాల్గొననున్నారని టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా ఈ యాక్షన్ సీక్వెన్స్ కోసం విదేశాల నుంచి ప్రత్యేకంగా రప్పిస్తున్న స్టంట్ ఫైటర్స్‌తో భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోందట. ప్రశాంత్ నీల్ సినిమాల్లో యాక్షన్‌కు ఎంత ప్రాధాన్యం ఉంటుందో ఇప్పటికే కేజీఎఫ్, సలార్ సినిమాలు నిరూపించాయి. అదే తరహాలో ఈ సినిమాలో కూడా రా అండ్ రగ్గడ్ యాక్షన్‌తో పాటు భారీ విజువల్ స్కేల్ ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ కోసం డిజైన్ చేస్తున్న యాక్షన్ ఎపిసోడ్స్ ఆయన స్క్రీన్ ప్రెజెన్స్‌ను కొత్త స్థాయికి తీసుకెళ్తాయని సమాచారం.

ఈ సినిమాకు డ్రాగన్ అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారన్న వార్తలు కూడా ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టైటిల్ పై ఇంకా అధికారిక ప్రకటన రాకపోయినా ఈ టైటిల్‌కు ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. మరోవైపు హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తుండగా, సంగీతాన్ని రవి బస్రూర్ అందిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో మైత్రీ మూవీ మేకర్స్ ఈ సినిమాను నిర్మిస్తోంది. ప్రశాంత్ నీల్ ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమాను అత్యంత గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నాడని, ఇది ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా నిలిచే అవకాశాలున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. వచ్చే ఏడాది ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేసే ప్లాన్‌లో మేకర్స్ ఉన్నట్టు సమాచారం.

# చిన్నబోయిన కేన్స్ 2026
# క్వీన్ ఐశ్వర్యరాయ్ లేని లోటు అలానే..!

ప్రపంచ ప్రసిద్ధ -కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026- వేడుకలు ఫ్రాన్స్‌లో అట్టహాసంగా ప్రారంభమైనా.. ఈసారి ఎందుకో ఆ పాత మెరుపు తగ్గినట్లు కనిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం.. గత రెండు దశాబ్దాలుగా కేన్స్ రెడ్ కార్పెట్‌పై తన అందచందాలతో మ్యాజిక్ చేస్తున్న -కేన్స్ క్వీన్- ఐశ్వర్యారాయ్ బచ్చన్ ఈ ఏడాది వేడుకలకు దూరంగా ఉండటమే. లారియల్ పారిస్ బ్రాండ్ అంబాసిడర్‌గా హోటల్ మార్టినెజ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్లలో ఐశ్వర్య ఫోటో లేకపోవడం చూసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన అభిమానులు షాక్‌కు గురయ్యారు. ఐష్ లేని కేన్స్ వేడుకలు కళ తప్పాయంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది.

ఐశ్వర్యారాయ్ కేన్స్‌తో ఉన్న బంధం ఈనాటిది కాదు. 2002లో -దేవదాస్- సినిమా ప్రీమియర్ కోసం షారుఖ్ ఖాన్, సంజయ్ లీలా భన్సాలీలతో కలిసి మొదటిసారి కేన్స్ వేదికపై అడుగుపెట్టిన ఐష్ ఆ తర్వాత ఏడాది నుండి లారియల్ ప్రతినిధిగా దాదాపు 22 ఏళ్ల పాటు నిరంతరాయంగా హాజరవుతూ వచ్చారు. కేన్స్‌లో తను ధరించే దుస్తులు, ఆ పోజులు అంతర్జాతీయ స్థాయిలో ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచాయి. అందుకే ఐశ్వర్యారాయ్ ను అభిమానులు -కేన్స్ క్వీన్- అని పిలుచుకుంటారు. ఈ ఏడాది ప్రచార చిత్రాల్లో ఐసూ కనిపించకపోవడంతో లారియల్ స్పందిస్తూ.. -సంవత్సరాలు గడిచినా కేన్స్ వేడుకలు మారినా ఆమె ఎప్పుడూ మిస్ అవ్వదు- అంటూ ఒక రహస్యమైన వివరణ ఇచ్చింది తప్ప ఐశ్వర్యారాయ్ హాజరుపై స్పష్టతను ఇవ్వలేదు.



ఐశ్వర్య లేని లోటును భర్తీ చేసేందుకు ఈసారి భారత్ నుండి యువ నటీమణులు ఆలియా భట్, తారా సుతారియా వంటి వారు కేన్స్‌లో సందడి చేస్తున్నారు. ముఖ్యంగా ఆలియా భట్ తన గ్లోబల్ అప్పీల్‌తో కేన్స్ రెడ్ కార్పెట్‌పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. లారియల్ బ్రాండ్ అంబాసిడర్ హోదాలో ఆలియా ధరించిన దుస్తులు..తన మేకప్ స్టైల్ అంతర్జాతీయ మీడియాను సైతం ఆకర్షించాయి. ఆలియా లుక్ గురించి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తూ.. తనను ఒక అంతర్జాతీయ తారగా ఎదుగుతున్న తీరును కొనియాడుతున్నారు. మరోవైపు యువ నటి తారా సుతారియా కూడా కేన్స్ 2026లో తన క్యాట్ వాక్ – గ్లామరస్ లుక్స్‌తో అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. తారా సుతారియా క్లాసిక్ & బోల్డ్ ఫ్యాషన్ ఛాయిస్ గురించి ఫ్యాషన్ విశ్లేషకులు గొప్పగా మాట్లాడుకుంటున్నారు. గత ఏడాది కంటే ఈసారి తారా సుతారియా మరింత ఆత్మవిశ్వాసంతో ర్యాంప్ వాక్ చేస్తూ భారతీయ సౌందర్యాన్ని ప్రపంచ వేదికపై ప్రదర్శిస్తోంది. ఆలియా, తారాల రాకతో కేన్స్‌లో యువత సందడి పెరిగిన మాట వాస్తవమే అయినా.. సీనియర్ నటి ఐశ్వర్యకున్న ఆ గ్రేస్ .. అనుభవం ముందు వీరు ఇంకా ఎదగాలనే చర్చ కూడా నడుస్తోంది. ఓవరాల్ గా ఇప్పటివరకూ 2026 కేన్స్ వేడుకలు కొత్త తరం నటీమణుల హవాతో ముందుకు సాగుతున్నా.. ఐశ్వర్యారాయ్ లేని లోటు మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బ్యూటీ ఎయిర్‌పోర్ట్ లుక్స్ నుండి రెడ్ కార్పెట్ అరంగేట్రం వరకు ప్రతిదీ ఒక పండుగలా ఉండేది. ఈ ఏడాది ఐశ్వర్యారాయ్ ప్రచార కార్యక్రమాలకు, యాడ్స్ కి దూరంగా ఉండటం కేన్స్ అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma